సింగిల్ కథలు

కానుక

సిటీ నడిబొడ్డున అతిపెద్ద గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మే షాపు 'ప్రేరణ'. 'ఏం కొనాలి.. ఎలాంటిది కొనాలి' అన్న ఆలోచనలతో లోపలికి అడుగుపెట్టింది శ్రావ్య. చల్లనిగాలి, సువాసనలు వెదజల్లే రూం స్ప్రే మనసుని కుదుటపడేలా చేసాయి. రకరకాల గిఫ్ట్ ఆర్టికల్స్‌తో కళకళలాడుతోంది షాపంతా.

మంచి వస్తువు కొనాలి. అది చూసినప్పుడల్లా నేను గుర్తుకు రావాలి. ఏం కొనాలి.. అని మళ్లీ మళ్లీ ఆలోచనల్లో పడగానే ''ఏం కావాలి మేడమ్?'' అన్న సేల్స్‌మేన్ మాటలకి తేరుకుని ''గిఫ్ట్ ఆర్టికల్స్ కావాలి'' అంది ముక్తసరిగా శ్రావ్య.

''అకేషన్ ఏంటి మేడమ్?''

జవాబు లేదు మౌనం. మళ్ళీ సేల్స్‌మేన్ ప్రశ్న..

''బర్త్‌డే.. మేరేజ్ డే.. వేలంటైన్స్ డే.. దేనికోసం మేడమ్? లేదా గృహప్రవేశానికా?'' అని రకరకాల అకేషన్స్‌ని గుర్తుచేశాడు సేల్స్‌మేన్ అతి వినయంగా.

'ఏం చెప్పాలి?' అని స్వగతంలో అనుకుంటూ..

''కొన్ని రకాల మంచి గిఫ్ట్స్ చూపించండి'' అంది శ్రావ్య.

వాచీలు, దేవుడి బొమ్మలు, కళాఖండాలు, వాల్‌పెయింటింగ్స్, ఫొటో ఆల్బమ్స్ ఇలా ఎన్నోరకాలు చూపించాడు.

ఏదీ నచ్చలేదు.

శ్రావ్య అటూ ఇటూ తిరుగుతూ ''ఇంకా మంచివి చూపించండి'' అంది.

''మేడమ్! అకేషన్ చెబితే చాలా ఈజీగా సెలక్ట్ చేసుకోవచ్చు. ఆ అకేషన్‌కి సంబంధించిన మంచి మంచి ఆర్టికల్స్ చూపించగలం'' అన్నాడు మళ్ళీ వినయంగా.

''నాకు మ్యారేజ్ ఫిక్స్ అయింది''

''కంగ్రాచ్యులేషన్స్ మేడం'' అని అతడనగానే...

''వినండి నే చెప్పేది''

''చెప్పండి మేడమ్''

''నేను నిన్నటిదాకా ఒక వ్యక్తిని ప్రేమించాను. అతడూ నన్ను ప్రేమించాడు. కానీ పెద్దలు నాకు మరో వ్యక్తితో పెళ్ళి నిర్ణయించారు. నేటి నుంచి మాజీ ప్రియుడు కాబోతున్న అతనికి మరపురాని కానుక ఒకటి ఇవ్వాలనుకుంటున్నా'' అని శ్రావ్య చెప్పగానే..

''ఓకే మేడమ్! క్షణంలో తెస్తా'' అని చెప్పి లోపల నుంచి జిగేల్‌మనే యాష్ ట్రే.. దానికి అటాచ్ చేయబడి విస్కీ బాటిల్ షేపులో ఓ పెన్ తీసుకొని వచ్చేడు. మేడిన్ ఇటలీ అని రాసివున్న ఆ ఆర్టికల్ చూడముచ్చటగానే వుండటంతో... ''ఓకే. ప్యాక్ చేసివ్వండి'' అంది శ్రావ్య.

-భళ్ళమూడి నాగరాజు
(రాయగడ, ఒరిస్సా)

డబ్బుకన్నా విలువైనది

''అబ్బాయికి ఫోన్ చేసారా? ఎలా వున్నాడుట? అసలు ఇన్ని రోజుల నుంచి ఉత్తరం ఎందుకు రాయలేదని గట్టిగా అడిగారా లేదా?''

వంటింట్లో కూర కలుపుతూ.. కలుపుతూ అలాగే అట్లకాడ చేత్తో పట్టుకుని వరండాలోకి వచ్చింది శారద.

విప్పిన షూస్‌లో సాక్స్ పెడుతూ ''లేదు శారదా! అబ్బాయితో మాట్లాడటం అవలేదు. దగ్గర దగ్గర రెండు గంటలు ప్రయత్నిస్తేగాని అమెరికా లైను దొరకలేదు. 'అమ్మయ్య' దొరికింది కదా అనుకుంటే అబ్బాయి రూమ్‌లో ఫోన్ రింగవుతున్నా ఎవరూ రిసీవర్ తీయటం లేదు. అప్పటికీ ఆతృతనాపుకోలేక మూడు ఐఎస్‌డి బూత్‌ల నుంచి చేసి చూశాను. మళ్ళీ అదే పరిస్థితి. ఈరోజు హాస్పిటల్‌కి కూడా సెలవే కదా! మరి ఎక్కడి వెళ్ళాడో, ఏమిటో అర్థం కావటం లేదు. బస్ బయల్దేరడానికి ఇంకా పది నిముషాల సమయం వుందని డ్రైవర్ చెబితే బస్టాండ్ నుంచి కూడా చేసాను. అక్కడ వాడికి ఏ పనులున్నాయో ఏమిటో మనకేం తెలుసు. చూద్దాం.. మరో నాలుగు రోజులు చూసి అప్పటికీ ఏ కబురూ లేకపోతే ఈసారి వైజాగ్ మా తమ్ముడింటికి వెళ్ళి, రెండు రోజులుండైనా సరే విషయం కనుక్కుని వస్తాను'' శారద ఇచ్చిన కాఫీ తాగి అలసటగా వాలు కుర్చీలో కూలబడ్డాడు.

శారద గుండెలో బాధ సుడులు తిరుగుతోంది. తాము వుండేది ఫోన్ సదుపాయం లేని మారుమూల పల్లెటూర్లో. కొడుకు శరత్ వుండేదేమో అమెరికాలోని టెక్సాస్‌లో. ఎప్పుడైనా, ఎవరికైనా ఫోన్ చెయ్యాలనుకుంటే అరవై కిలోమీటర్ల దూరంలో వున్న టౌనుకి వెళ్ళి చెయ్యవలసిందే. అందుకే శరత్ ఎప్పుడూ ఫోన్ జోలికి వెళ్ళకుండా, పదిహేను రోజులకోసారి లెటర్ రాస్తూంటాడు. ఈసారి దగ్గర దగ్గర నెలరోజులవుతోంది వాడి నుంచి

నుంచి లెటర్ వచ్చి.. పాపం ఎలా వున్నాడో ఏమిటో అసలే అది దేశం కాని దేశం. శారద మనసు పరి పరి విధాలు పరుగులు తీస్తోంది.

కంట్లో ఉబుకుతున్న నీరు భర్త కంటపడకూడదని ఖాళీ గ్లాస్ తీసుకుని వంటగదిలోకి నడిచింది శారద.

★ ★ ★

శారద, రాఘవల ఏకైక సంతానం శరత్ చంద్ర. రాఘవ జిల్లాపరిషత్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆదర్శ ఉపాధ్యాయునిగా ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అటు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా బహుమతులు అందుకున్నారు. కానీ ఇంచుమించు సర్వీసంతా చిన్న చిన్న పల్లెటూళ్ళలోనే గడిచిపోతున్నది. ఆ ప్రశాంత వాతావరణానికి ఇద్దరూ బాగా అలవాటు పడిపోయారు.



తన కొడుక్కి ఎంత శ్రద్ధగా చదువు చెప్పేవారో, అంతే శ్రద్ధగా మిగతా పిల్లలకీ చదువు చెప్పేవారు. పేద పిల్లలకి సాయం కాలంపూట ఉచితంగా పాఠాలు చెప్పడమే కాకుండా ఇద్దరు ముగ్గురు పిల్లలకి తన సొంత ఖర్చుతో చదివిస్తున్నారు.

పుట్టిన రోజు నాడూ, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడూ శరత్‌ని తనతో పాటూ పట్నం తీసుకెళ్ళి మంచి మంచి సైన్స్ బుక్స్ కొనివ్వటమే కాకుండా దగ్గర కూర్చోబెట్టుకుని ప్రతి పేజీ చదివి వివరంగా చెప్పేవారు. దానితో శరత్‌కి సైన్స్ అంటే విపరీతమైన ఇష్టం ఏర్పడింది. సినిమాహాలు కూడా లేని స్వచ్ఛమైన పల్లెటూర్లలో శరత్‌కి తల్లిదండ్రులే స్నేహితులు. మరే ఇతర వ్యాపకాలూ లేవు. టెన్త్‌లో స్టేట్ థర్డ్ వచ్చాడు. తర్వాత తనకిష్టమైన బైపిసి గ్రూపు తీసుకుని ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవడం, తర్వాత ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి ఎంబిబిఎస్ చెయ్యడం, తర్వాత పిజి చెయ్యడం చకచకా జరిగిపోయాయి.

హాస్టల్‌లో వుండి చదువుకుంటూ సెలవు దొరికినప్పుడు తల్లిదండ్రుల దగ్గరకు వస్తూండేవాడు. ఆ పల్లెల్లో ప్రజలందరికీ ఉచితంగా వైద్యం చెయ్యడమే కాకుండా తన సొంత ఖర్చుతో మందులు ఇస్తూండేవాడు. ఆ పల్లెవాసులకి శరత్ కనిపించే దేవుడితో సమానం. తన కొడుకుని చూసుకుని శారద, రాఘవ మురిసిపోయేవారు. ఆ సమయంలోనే శరత్ ఫ్రెండ్ అమెరికాలో డాక్టర్ ఉద్యోగం సంపాదించుకోవడం, అతని ప్రోద్బలం మీద శరత్ దరఖాస్తు చెయ్యడం, డల్లాస్‌లోని హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా ఉద్యోగం రావటం జరిగిపోయాయి.

తన కొడుకు మంచి డాక్టరై మాతృదేశానికి సేవ చేయాలని రాఘవ కోరిక. కానీ కొడుకు అభిప్రాయాలకు విలువనిచ్చే ఆయన వద్దు అని అభ్యంతరం చెప్పలేకపోయారు.

''పోస్ట్'' అన్న అరుపుతో ఉలిక్కిపడి చూసారు రాఘవ.

గుమ్మంలో ఎయిర్ మెయిల్ పడి వుంది.

శరత్ రాసిన లెటర్.

''శారదా! అబ్బాయి దగ్గర్నుంచి లెటర్'' అంటూ రాఘవ ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి ఉత్తరం చేతిలోకి తీసుకున్నారు: అందంగా అమర్చిన అక్షరాల వెంట కళ్ళు పరుగులు తీసాయి.

ప్రియమైన అమ్మకి, నాన్నగారికి..

నేను క్షేమము. మీరిద్దరూ ఎలా వున్నారు? నేను ఇక్కడికి వచ్చి నాలుగు నెలల పైనే అయింది. మాతృదేశానికి, కన్నవారికీ దూరంగా వుండటం మనిషిని మానసికంగా ఎంత ఒంటరివాడిని చేస్తుందో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఇక్కడ నాకొచ్చే జీతం.. సోషల్ స్టేటస్, విలాసవంతమైన జీవితం ఏదీ.. ఏదీ నాకు నిజమైన ఆనందాన్ని ఇవ్వలేకపోతున్నాయి.

సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేని మన వూర్లోని ప్రజలకు నేను వైద్యం చేసినప్పుడు వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నప్పుడు నాకు ఎంతో తృప్తి కలిగేది. 'పది కాలాల పాటు చల్లగా వుండు బాబూ' అంటూ వారంతా ఆప్యాయంగా నన్ను దీవిస్తుంటే, మీ ఇద్దరి కళ్ళల్లో కనపడే సంతృప్తి నాకెంతో స్ఫూర్తిని కలిగిస్తుండేది. మీ ఆనందాన్ని, సంతృప్తిని కలకాలం నిలపాలనే పట్టుదలతో చదివేవాడిని. ఆ స్ఫూర్తితోనే పిజి పూర్తిచేశాను.

కానీ ఇక్కడ పరిస్థితి వేరు. ప్రతీ వందమంది జనాభాకి ఒక డాక్టరు, మంచి హాస్పిటలూ అందుబాటులో వున్నాయి. వైద్య సదుపాయం లేక మరణించేవారు ఎవరూ లేరిక్కడ. నేను ఇక్కడ లేకపోయినా ఎవరికీ ఇబ్బంది లేదు. కానీ నాలాంటి డాక్టర్ల అవసరం మన దేశానికి ఎంతో వుంది. లక్షలు లక్షలు ఖర్చు చేసి మన ప్రభుత్వం డాక్టర్లని తయారు చేస్తూంటే, డబ్బు సంపాదనలో పడి మాతృదేశాన్ని వదలి వేరే దేశాలకి పరుగులు తీయడం ఎంత నీచమైన పనో ఇప్పుడు అర్థమయింది. డబ్బుకన్నా విలువైంది మానసిక తృప్తి అన్న విషయం తెలుసుకున్నాను నాన్నగారు!

ఆనందం కలిగినా, బాధ కలిగినా పంచుకోవడానికి 'నా వారంటూ' లేని జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. నాన్నగారూ! నాకు మీరు కావాలి. అమ్మ కావాలి. నా ఫ్రెండ్స్.. నా పల్లె ప్రజలు.. నా మాతృభూమి.. అన్నీ కావాలి. అందుకే ఇక్కడ ఉద్యోగానికి రిజైన్ చేసేస్తున్నాను. ఆ పనుల హడావుడిలో పడిపోయి మీకు ఆలస్యంగా లెటర్ రాస్తున్నాను. వచ్చేస్తున్నాను. ఇక్కడ ఫార్మాలిటీస్ పూర్తిచేసుకుని త్వరలోనే మీ ముందుంటాను. ఎప్పుడూ మనం కలిసే వుందాం.

మీ

శరత్ చంద్ర.

రాఘవ కళ్ళలో ఆనంద భాష్పాలు. శారద సంతోషంగా ఉత్తరాన్ని అందుకుని ముద్దుపెట్టుకుంది.

-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)